

వైవీయూ కళాశాల టీచర్లకు 'రాష్ట్ర ఉత్తమ గురువు పురస్కారాలు'

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగివేమన విశ్వవిద్యాలయం పోస్టు గ్రాడ్యుయేషన్ కళాశాల ఆచార్యులు నలుగురికి రాష్ట్ర ఉత్తమ అధ్యాపక పురస్కారాలు వరించాయి. సోషల్ సైన్సు విభాగంలో విశ్వవిద్యాలయ మనోవిజ్ఞానశాస్త్ర శాఖ సహ ఆచార్యులు డాక్టర్. కె. లలిత, డిపార్టుమెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజిమెంటు సహ ఆచార్యులు డా.పి. సరిత , లైఫ్ సైన్సెస్ విభాగంలో వృక్షశాస్త్ర శాఖ ఆచార్యులు ఎ. మధుసూదన్ రెడ్డి, డిపార్టుమెంట్ ఆఫ్ బయోటెక్నాలజి ఆచార్యులు ఎ.చంద్రశేఖర్, ఫిజికల్ సైన్సు ఆచార్యులు జి. కాత్యాయని 2023 సంవత్సరానికి 'విశ్వవిద్యాలయ ఉత్తమ అధ్యాపకులు'గా ఎంపికయ్యారు. ఈ నెల 5న విశాఖపట్నంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్సా సత్యనారాయణ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకోనున్నారు.



ముంచెత్తిన వాన

- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- వాగులో చిక్కుకున్న ఆర్‌టిసి బస్సు
- గుండ్లకుంట గ్రామాన్ని ముంచెత్తిన వరద
- భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఓబుళాపురం గ్రామ సమీపంలో బురదలో చిక్కుకున్న లారీలు
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- వేంపల్లెలో జలమయమైన వీధులు

వారం రోజులుగా వర్షాలు లేక, ఎండవేడిమి తాళలేక, ఉక్కపోతతో అల్లాడిన జనానికి శనివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంతో కాస్త ఊరుట లభించింది. మరోవైపు భారీ వర్షానికి జమ్మలమడుగు ప్రాంతంలో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఈ క్రమంలోనే వాగులో ఆర్‌టిసి బస్సు చిక్కుకుంది. ఆ సమయంలో పోలీసులు వెంటన స్పందించడంతో ప్రయాణికులకు ప్రాణాపాయం తప్పింది. పెద్దముడియం మండలంలోని గుంట్ల గ్రామాన్ని వరదనీరు ముంచెత్తింది. మోకాళ్లలోతు వరకు నీరు రాడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరో వైపు ఓబుళాపురం గ్రామ సమీపంలోని బ్రిడ్జి వద్ద బురదలో లారీలు చిక్కుకోడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వేంపల్లె మండల కేంద్రంలోని వీధులన్నీ జలమయమయ్యాయి.

- ప్రజాశక్తి-యంత్రాంగం

జమ్మలమడుగు : నియోజకవర్గంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. జమ్మల మడుగు మండలం ఎస్.ఉప్పలపాడు గ్రామ సమీపంలో ఇసుక వాగు పొర్లడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. ఇసుక వంక వాగులో కర్నూలు నుంచి ప్రొద్దుటూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సు (ఏపీ 04 జెడ్ 0156) వంకలో చిక్కు కుపోయింది. విషయం తెలుసుకున్న జమ్మల మడుగు అర్బన్ సిఐ సదాశివయ్య తన సిబ్బందితో కలిసి రెస్క్యూ ఆపరేషన్ నిర్వ హించారు. ఇందులో డ్రైవర్, కండక్టర్‌తోపాటు 13 మంది ప్రయాణికులను సురక్షితంగా కాపాడారు. బస్సులో ఉన్న ప్రయాణి కులందరిని సురక్షితంగా బయటకు తీసుకురావడంతో సిఐ సదాశి వయ్యను, పోలీస్ సిబ్బందిని ప్రజల తోపాటు ఎస్‌పి అన్బురాజన్ అభినం దించారు మరో వైపు పెద్దముడియం మండలంలోని గుండ్లకుంట గ్రామాన్ని భారీ వర్షానికి వరద నీరు చుట్టు ము ట్టింది. శనివారం రాత్రి గ్రామంలో దాదాపు 16 సెంటీమీటర్ల మేర వర్షం కురిసింది. వర్షం ధాటికి వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మోకాళ్ళ లోతు వరకు వరద నీరు ప్రవాహం ప్రవహిస్తుండడంతో ప్రజలు జీవనానికి, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. గ్రామంలోని లోతట్టు ప్రాంతాలలోని గహాల్లోకి నీరు చేరాయి. సమాచారం అందిన వెంటనే ఎమ్మెల్సీ పొన్నపు రెడ్డి రామసుబ్బారెడ్డి ట్రాక్టర్‌లో గ్రామాన్ని పరిశీలించి సంబంధిత అధికారులతో సహాయక చర్యలపై చర్చించారు. భారీ వర్షానికి ఇబ్బందులు పడుతున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు జమ్మలమడుగు పట్టణంలోని పలు ప్రాంతాలు భారీ వర్షానికి జలమయమై చెరువులను తలపిస్తున్నాయి. ఆర్టీసీ బస్టాండ్, డిఎస్‌పి బంగ్లా, ఎంపిడిఒ కార్యాలయం ఆవరణ తదితర ప్రాంతాలేగాక పలు కాలనీలలో వర్షపు నీరు చేరి ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



ప్రయాణికులను రక్షిస్తున్న పోలీసులు




గుండ్లకుంట గ్రామంలోకి చేరిన వరద నీరు

పెద్దముడియం : మండలంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు వరదలతో పోటెత్తాయి. వంకలు నిండి గ్రామా ల్లోని వీధుల గుండా వరద నీరు సెలయేర్లులా పారి ఊర్ల న్నీ జలమ యమయ్యాయి. మండలంలోని చాలా గ్రామాలకు రాకపోకలు గ్రామాల నిలిచిపోయాయి. గుండ్లకుంట గ్రామంలో వరద తీవ్ర రూపం దాల్చడంతో ఇళ్లల్లోకి నీరు చేరింది. ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామ సుబ్బారెడ్డి అలాగే మాజీ ఎంపీపీ గిరిధర్ రెడ్డి తమ కార్యకర్తలతో వరద నీరు చేరిన వీదుల్లో తిరుగుతూ సహాయ చర్యల్లో పాల్గొని తక్షణమే అధికారులకు అప్రమత్తం చేసి ప్రజలకు కనీస సౌకర్యాలకు వెంటనే కల్పించాలని తెలిపారు. గుండ్లకుంట ఉప్పలపాడు మధ్య ఉధృతంగా ప్రవహించే తీగలేరు వరద ఉధృతి తగ్గకపోవడంతో జమ్మలమడుగు నుంచి పెద్దముడియం మండల గ్రామాల వైపు వెళ్ళే ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. నెమళ్లదిన్నె గ్రామం వద్ద కుందూ నది ఉధృతంగా వంతెనపైన ప్రవహిస్తునడంతో నదీ ప్రాంతం వైపు ఎవరూ వెళ్లకూడదని మండల ప్రజలకు తెలియజేస్తూ ఎస్ఐ రామకృష్ణ తమ సిబ్బందిని వంతెన వద్ద కాపలాగా నియమించారు. అదేవిధంగా పల్లెల్లోని పాత మిద్దెలలో నివాసం ఉంటున్న వారు వర్షాకాలం జాగ్రత్తగా ఉండాలని ఉండాలని భారీ వర్షాల వలన కాలం చెల్లిన మిద్దెలు కూలే ప్రమాదం ఉంది కాబట్టి ఎంతో అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సూచించారు.



గుండ్లకుంట గ్రామంలో పర్యటిస్తున్న రామసుబ్బారెడ్డి

ముద్దనూరు : మండలంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లాయి. వేసవి తలపిస్తూ మండుతున్న ఎండల ధాటికి వేడిని తట్టుకోలేక ప్రజలు ఉక్కపోతతో అల్లాడారు. వర్షం కురవడంతో చల్లని వాతావరణం నెలకొంది. తాడిపత్రి రహదారిలోని ఓబుళాపురం గ్రామం సమీపంలో ఉన్న బ్రిడ్జి వద్ద రెండు వైపులా లారీలు ఇరుక్కుపోయి. బ్రిడ్జి వద్ద మరమ్మతులు జరుగుతుండటంతో బురదలో ఇరుక్కున్నాయి. ప్రధాన రహదారి కావడంతో లారీలు, బస్సులు, కార్లు నిలిచిపోయి భారీగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



బ్రిడ్జి వద్ద స్తంభించిన రాకపోకలు

వేంపల్లె : శనివారం రాత్రి ఒక్క సారిగా కురిసిన కుండపోత వర్షానికి వీధులన్నీ జలమ యమయ్యాయి. స్థానిక గండి రోడ్డులో ఉన్న వైఎస్ఆర్ గెస్ట్ హౌస్ వెనుక వీధిలో మోకాళ్ళ లోతు వరకు వర్షపు నీరు ప్రవహి ంచడంతో వీధిలో ఉన్న ఇళ్లల్లోకి మురుగు నీరు చేరాయి. బియ్యంతో పాటు ఇతర వస్తువులు తడిసి పోయినట్లు అ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. కొనేళ్ల నుంచి ఇలాంటి సమస్య ఉందని, అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోవడం లేదని వాపోయారు. చిన్నపాటి వర్షం కురిసినా వైఎస్ఆర్ గెస్ట్ హౌస్ వెనుక వీధి మాత్రం చెరువులాగ వీధి అంతా నీటితో నిండి పోతుంది. మురుగునీరు ఎండి పోయినంత వరకు పెద్దలు, పిల్లలు, మహిళలు బయటికి రావాలంటే జంకుతుంటారు. పోలవరం ముంపు ప్రాంతంగా ఉండడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు కింద భాగం వర్షపు నీరు అంతా వీధుల్లోకే వెళ్తోందని చెప్పారు. ఇంట్లోకి వర్షపు నీరు చేరడంతో రాత్రి జాగారం చేయాల్సిన పరిస్థితి వచ్చిందని ప్రజలు వాపోయారు. దోమలు కూడ విపరీతంగా పెరిగి పోవడంతో ఆనారోగ్యానికి గురై ఆస్పత్రులకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ కాలువల్లోని విష కిటకాలు కూడ వర్షపు నీటిలో ఇంట్లోకి వస్తున్నట్లు చెప్పారు. విష పురుగులతో భయాందోళనకు గురి అవుతున్నట్లు చెప్పారు. తమ కష్టాలను తొలగించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకొని రోడ్డును ఎత్తు పెంచాలని ప్రజలు కోరుతున్నారు.



వేంపల్లె వీధిలోకి చేరిన వర్షపు నీరు

శాశ్వత పరిష్కారం చూపాలి

వైఎస్ఆర్ గెస్ట్ హౌస్ వెనుక వీధుల్లో నిలిచిన వర్షపు నీరు నిల్వలు లేకుండా అధికారులు, వైసిపి నాయకులు శాశ్వత పరిష్కారం చూపాలని టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ కోరారు. వీధుల్లో నిలిచిన వర్షపు నీటిని ఆదివారం టిడిపి నాయకులతో కలిసి మహమ్మద్ షబ్బీర్ పరిశీలించారు. అ ప్రాంతంలో వర్షపు నీటితో అవస్థలు పడుతున్న బాధితులతో సమస్యలను ఆడిగి తెలుసుకున్నారు. సిఎం జగన్ రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న పులివెందుల నియోజకవర్గం వేంపల్లె గ్రామంలోని ఇమామ్‌నగర్‌లో ఇలాంటి దుస్థితి నెలకొనడం బాధాకరమని వాపోయారు. డ్రైనేజీ కాలువలోని పూడిక తీసినంత మాత్రనా సమస్యకు పరిష్కారం కాదు అన్నారు. సాధ్యమైనంత వరకు రోడ్డును ఎత్తు పెంచి వర్షపు నీటి నిల్వలు లేకుండా చేయాలని చెప్పారు.

వర్షపు నీటితో ఇబ్బందులు పడుతున్నాం

వర్షపు నీటితో చాలా ఇబ్బందులు పడుతున్నాం. శనివారం రాత్రి కురిసిన వర్షానికి ఇంట్లోలోకి వర్షపు నీరు చేరాయి. ఇంట్లో ఉన్న బియ్యం బస్తాలతో పాటు ఇతర వస్తువులు పూర్తిగా తడిసి పోయాయి. వర్షపు నీటిలో విష పురుగులు కూడా ఇంట్లోకి వస్తుండడంతో చాలా భయంగా ఉంది. వర్షం కురిసిన ప్రతి సారీ ఇంటి ముందు వర్షపు నీరు మోకాళ్ల లోతు నిల్వ ఉంటుంది. ఇంటి నుంచి బయటికి పోవాలన్నా ఇబ్బందిగా ఉంది. నీరు నిల్వలు లేకుండా అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలి.

- సల్మా, ఇమామ్ నగర్, వేంపల్లె

అన్ని చర్యలు తీసుకొంటాం

వైఎస్ఆర్ గెస్ట్ హౌస్ వెనుక వీధిలో వర్షపు నీరు నిల్వలు లేకుండా చర్యలు తీసు కొంటాం. ఆదివారం వీధుల్లో నిలిచిన వర్షపు నీటిని పరిశీలించాం. తక్షణం గండి రోడ్డులోని డ్రెయినేజీ కాలువల్లో పూడిక తీసి నీరు నిల్వ లేకుండా చేయాలని పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డిని ఆదేశించాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేసేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రోడ్డును ఎత్తు పెంచే విధంగా చేస్తాం.

- రాచినేని శ్రీనివాసులు, సర్పంచ్

గణిత శాస్త్రంలో పిహెచ్‌డి ప్రదానం

ప్రజాశక్తి - కడప అర్బన్



కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ (గణిత) విభాగంలో సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్న జి. శ్రీధర్‌కు రాయలసీమ విశ్వవిద్యాల యం (కర్నూలు) వారు పిహెచ్‌డి డిగ్రీని ప్రదానం చేశారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. ఎస్. ఎస్. మూర్తి తెలిపారు. జి. శ్రీధర్ కెఎస్ఆర్ ఎం ఇంజినీరింగ్ కళాశాలలో గణిత విభాగంలో రిటైర్ అయిన ఆచార్యులు డాక్టర్ బి. రామ్ భూపాల్ రెడ్డి పర్యవేక్షనలో పరిశోధన చేయడం వలన రాయలసీమ విశ్వ విద్యాలయం, (కర్నూలు) పిహెచ్‌డి పట్టాను ప్రదానం చేశారని పేర్కొన్నారు. జి శ్రీధర్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు సెమినార్స్, వర్క్ షాప్స్, కాన్ఫరెన్స్ లలో పరిశోధన పత్రాలను సమ ర్పించారు. పట్టాను పొందడం పట్ల కళాశాల కరస్పాండెంట్, సెక్రటేటరి కందుల రాజేశ్వరమ్మ, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వి ఎస్ ఎస్ మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి ప్రేమ్ కుమార్, హ్యూమానిటీస్ సైన్సెస్ విభాగాధిపతులు డాక్టర్ ఐ. శ్రీవాణి, సహచర కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

ప్రయివేటు ఉపాధ్యాయులకూ అవార్డులు

ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

వచ్చే ఏడాది నుంచి ప్రభుత్వం ఉత్తమ సేవలకు అవార్డుల తరహాలోనే ప్రయివేటు ఉపాధ్యాయులకు అధికారికంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి, పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశం హాలులో అపుస్మా జిల్లా అధ్యక్షులు గంగయ్య అధ్యక్షతన గురుపూజోత్సవం నిర్వహించారు. ఈసందర్బంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేటు ఉపాధ్యాయులు రెండు కళ్లులాంటివారని చెప్పారు. ఉపా ధ్యాయులు సమాజానికి మూల స్తంభాలని కొనియాడారు. వచ్చే ఏడాది ఆధికారంగా ప్రయివేటు ఉపాధ్యా యులకు అవార్డులు బహూకరణకు కృషి చేస్తామన్నారు. చైల్డ్ కేర్ సెలవులు, రూ. 5 లక్షల రుణ సదుపాయానికి కృషి కల్పనకు ప్రయత్నాలను చేస్తున్నా మన్నారు. డిసిఇబి హాలు ఏర్పాటుకు సహకరించాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్ నాధరెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ విద్య అనగానే మాజీ సిఎం వైఎస్ఆర్ గుర్తుకు వస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ, మేయర్ తో కలిసి విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి పాటుపడతామన్నారు. మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ ఇటీవల గ్రూప్ ఫలితాల్లో ప్రయివేటు వాటా అధికమని చెప్పారు. కడప జిల్లాలో 390 నుంచి 400 మంది కరస్పాం డెంట్లు ఉన్నారన్నారు. అనంతరం అతిథులు జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి, ఎంఎల్సీ మేయర్ ఉత్తమ సేవలు అందించిన పలువురు ఉపాధ్యాయులకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్లు టి.నిర్మలాదేవి, శివశంకర్ రెడ్డి, మైథిలి, రమణారెడ్డి, పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

కార్మిక వ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

ప్రజాశక్తి- కడప అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వెంటనే తిప్పికొట్టాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పిలుపునిచ్చారు. ఆదివారం సిఐటియు వర్క్ షాప్ ర్క్‌లో మాట్లాడారు. జిల్లాలో కార్మికులు అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కడప ఇండస్ట్రియల్, కొప్పర్తి ఇండస్ట్రీలో కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయలేదని చెప్పారు. సుప్రీంకోర్టు ఇచ్చినటువంటి తీర్పు ప్రకారం పనికి తగంగ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కార్మికులకు, ఉద్యోగులకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలన్నీ కూడా ప్రయివేట్‌కు ధారా దత్తం చేయడం దుర్మార్గం అన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేయడం అన్యా యమని చెప్పారు. పోరాటం తప్ప మరో మార్గం లేదని కార్మికు లకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామన్న మాట వెంటనే నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా కార్మికులకు సరైనటువంటి సౌకర్యాలు లేకపో యినా లేబర్ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని తెలిపారు. ప్రయిట్ పాఠశాల, ఆస్పత్రుల్లో కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్కీం వర్కర్లు అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజనం, మున్సిపల్ ,కార్మికులు విద్యుత్ కార్మికులు, ప్రభుత్వ డిపార్మెంట్లో పనిచేసే అన్ని రకాల కార్మికులు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాబోయే కాలంలో కార్మికుల సమస్యల మీద పనిచేసే వాళ్ళకి ఓటేయాలని పిలుపునిచ్చారు. వర్క్ షాప్ కు బి లక్ష్మీదేవి అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, వెంకటసుబ్బయ్య, భైరవ ప్రసాద్, చంద్రశేఖరు, ఆర్.లక్ష్మీదేవి, జిల్లా కమిటీ సభ్యులు అంజలీదేవి, విజయ్ కుమార్, లక్ష్మీదేవి, నాగలక్ష్మి, పుల్లయ్య, సుదర్శను, చంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, విజయలక్ష్మి, వెంకటపతి, సుబ్బరాయుడు రంగాల ప్రాంతాల నాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన కార్మికులు, నాయకులు

నేర నిరోధానికే ప్రాధాన్యత

ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి కడప డిఎస్‌పి మహ్మద్ షరీఫ్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

నేరాల అదుపునకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. నేరాల మూ లాలపై దృష్టి సారించాం. ఇందులోభాగంగా భూకబ్జాలు మొదలు కుని దొంగతనాలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ వంటి చర్యలు తీసుకో వడమైంది. ఇటువంటి ముందస్తు చర్యల కారణంగా క్రైమ్ రేషియో తగ్గుముఖం పట్టింది. మరింతగా నేరాలను అదుపు చేయడమే ధ్యే యంగా ముందుకెళ్తున్నాం. ఇందులోభాగంగా సిసి కెమెరాల ఏర్పా టు దగ్గర నుంచి ఎల్‌హెచ్‌ఎంఎస్ వంటి సాంకేతిక సేవలు ఉపయో గించు కుంటున్నామని పేర్కొంటున్న కడప డిఎస్‌పి మహ్మద్ షరీఫ్ తో ప్రజాశక్తి ముఖాముఖి...



ముఖా ముఖి..

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకుంటున్న చర్యలేమిటి?

కడపలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కీలకమైన రహదారుల విస్తరణ కార్యక్రమం కొనసాగుతోంది. వాహన పార్కింగ్ ప్రాంతాలను గుర్తించి, ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం, సిగ్నల్ పాయింట్స్ యాక్టివేట్ చేయడం, బారీకేడ్స్ ఏర్పాటు చేయడం వంటి చర్యలతో ట్రాఫిక్ ఇబ్బందులు తల్తెకుండా చర్యలు తీసుకోవడమైంది. మున్సి పల్ కార్పొరేషన్‌తో కలిసి రూ.15 లక్షల విలువ కలిగిన సామగ్రిని కొనుగోలు చేయడంపై దృష్టి సారించడమైంది.

కడప డివిజన్ పరిధిలోని పిఎస్‌లు, సిఎస్ స్టేషన్లు ఎన్ని?

కడప డివిజన్ పరిధిలో 13 పోలీస్‌స్టేషన్లున్నాయి. కడపలో మూడు, ఒంటిమిట్ట, సిద్ధవటం, చింతకొమ్మదిన్నె, కమలాపురం, పెండ్లిమర్రి, వల్లూరు, చెన్నూరు, ఖాజీపేట, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాలు ఒంటిమిట్ట, కడపలో రెండు, కమలాపురం ప్రాంతాల్లో ఉన్నాయి.

నేరాల అదుపునకు తీసుకుంటున్న చర్యలేమిటి?

నేర మూలాలపై దృష్టి సారించడమైంది. ఇందులో పోలీస్ స్టేషన్ల వారీగా భూక బ్జాలు మొదలుకుని దొంగతనాలు, అల్లర్ల నివా రణకు చర్యలు తీసుకోవడమైంది. ఫలితంగా కడప డివిజన్ పరిధిలో నేరాల అదుపు చేయడంలో కొంతమేరకు సఫలీకృతమయ్యామని చెప్పవచ్చు.

ఎల్‌హెచ్‌ఎల్‌ఎస్ సేవల గురించి తెలపండి?

కడపలో ఎల్‌హెచ్‌ఎల్‌ఎస్ ప్రక్రియ విజయవంతంగా కొనసాగుతోంది. ఇంటి యజమానుల ఫిర్యాదు మేరకు సంబంధిత ఇంటికి సిసి కెమెరాల ఏర్పాటు చేసి ఇళ్ల సహా దాని పరిసరాలను తమ సర్వేలెన్స్ పరిధిలోకి తీసుకోవడం జరుగుతుంది. ఫలితంగా సంబంధిత ఇంటి పరిధిలోనికి ఎటువంటి అనుమానితులు వచ్చినా పోలీసులు అప్రమత్తం కావడం ద్వారా ఎటువంటి చోరీ ఘటనలు పునరావృతం గాకుండా చూసుకోగలుతున్నాం.

శాంతిభద్రతల నివారణకు తీసుకుంటున్న చర్యలేవి?

తమ పరిధిలో శాంతిభద్రతల నివారణపై చర్యలు తీసుకో వడమైంది. కడప నగరంలోని నేరాలకు ఆస్కారమిచ్చే స్లమ్‌ఏరియా లపై దృష్టి సారించాం. ఇందులోభాగంగా బ్లూకోల్ట్స్ సేవలు విస్తృతిని పెంచాం. ఇందులోభాగంగా బ్లూకోల్ట్స్, రక్షక్ పోలీసుల సేవలను ఉపయోగించుకుంటున్నాం. రోజుకు మూడు షిఫ్టులుగా విభజించడ మైంది. రాత్రి, పగలనే తేడా లేకుండా పోలీసులు గస్తీని ముమ్మరం చేయడమైంది.

ఘనంగా వెలిగండ్ల శిరీష జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - కడప

19 వ డివిజన్ వైసిపి కార్పొరేటర్ వెలిగండ్ల శిరీష జన్మదిన వేడుకలు ఆదివారం వెలిగండ్ల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. వెలిగండ్ల శిరీష జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర కమిటీ అధ్యక్షులు కళ్యా సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా నరసింహారావు, కోశాధికారి టేకురి సుదర్శన్ లు వెలిగండ్ల శిరీష కు జన్మదిన శు భాకాంక్షలు తెలియజేసి బహుమతిని అందజేశారు. జన్మదిన వేడుకల కార్యక్రమంలో వెలిగండ్ల లక్ష్మయ్య, వెలిగండ్ల శిరీష బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేటి ధర్నాను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ, ఇళ్ల స్థలాలకు సాగు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల రెవెన్యూ కార్యాలయం వద్ద నిర్వహించబోయే ధర్నాను విజయవంతం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి నరసయ్య కోరారు. ఆదివారం ధర్నాకు సంబంధించి కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కె. సుబ్బ రాయుడు, ప్రసాద్, బాబాఫకృద్దీన్, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

కువైట్‌లో వైఎస్‌ఆర్‌కు ఘన నివాళులు

కడప : వైఎస్ఆర్ కువైట్ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి ఆదే శానుసారం మాలియా ప్రాంతంలోని పవన్ ఆంధ్ర రెస్టారెంట్‌లో కమిటీ సభ్యులు అభిమానులు రాజన్న 14వ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గల్ఫ్ కో–కన్వీనర్ గోవిందు నాగరాజు, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు మన్నూరు చంద్ర శేఖర్ రెడ్డి మాట్లాడుతూ వై.యస్. రాజశేఖర్ రెడ్డి ప్రతి తెలుగు వారి గుండెల్లో శాశ్వతంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎపి ఎన్ఆర్‌సెస్ రీజనల్ కో–ఆర్డినేటర్ నాయని మహేష్‌రెడ్డి, వైసిపి బిసి ఇన్‌ఛార్జి రమణయాదవ్, యువజన విభాగం ఇన్‌ఛార్జి మర్రి కల్యాణ్ వైసిపి నాయకులు పాల్గొన్నారు.

బుడగ జంగాల సమస్యలు పరిష్కరించాలి

కడప : బుడగ జంగాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషకు బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు, వైసిపి యువజన జిల్లా కార్యదర్శి పస్తం అంజి, బుడగ జంగం కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. ఆదివారం 48వ డివిజన్‌లో బుడగ జంగం కాలనిలో గడప గడప కుమన ప్రభుత్వం అనే కార్యక్రమంలో పస్తం అంజి ఇంటి వద్ద బేడా బుడగ జంగం కులానికి ఎస్సీ కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నగర్ అధ్యక్షులు సుబ్బారెడ్డి, డివిజన్ నాయకులు, కడప మార్కెట్ యర్డ్ చైర్మన్ బంగారు నాగయ్య, అఫ్జల్ ఖాన్, వెంకటసుబ్బమ్మ, బుడగ జంగం నాయకులు సి.పెంటయ్య. కే లక్షమయ్య డి.రాముడు పి శ్రీను పి ఆంజనేయులు సి వెంకటయ్య పి ఇద్దమ్మ డి శంకర్. వైసిపి నాయకులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గాన్ని ప్రకటిస్తున్న నిర్వాహకులు

హాకీ రాష్ట్రకార్యదర్శిగా ఎస్.సుభాన్‌బాషా

ప్రజాశక్తి - కడప

పార్టీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఏకగ్రీ వంగా ఎన్నికయింది. రాష్ట్ర కార్యదర్శిగా కడప జిల్లాకు చెందిన ఎస్. సుభాన్ బాషా, రాష్ట్ర అధ్యక్షులుగా డి.వి. కరుణ కుమార్, ఉపాధ్యక్షులుగా దివ్య కోటి, నోయిల్ ట్రెజర్, కోశాధికారిగా ఎం. మల్లికార్జున, సంయుక్త కార్యదర్శులుగా టి. లక్ష్మణ కుమార్, వెంకట్ పద్మ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా సింహాద్రి యాదవ్, దేవ కుమారి, బాలాజీ, సుబ్బయ్య, పటాన్ రసూల్, ఎం. కె. ఎస్. ఎం. జిలాని, వై. గురు భాస్కర్, నాగేశ్వరరావు, మంజు, నిర్మల, ఎండి మొయినుద్దీన్ అహ్మద్ ఎన్నికయ్యారు. ఆదివారం కడప నగరం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద గల సుభాన్ బాషా కార్యా లయంలో నూతన కార్యవర్గ ఎన్నిక సమావేశం నిర్వహించారు. నూతన కార్యవర్గం ఎన్నిక అనంతరం హాకీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్రంలో హాకీకి పూర్వం తీసుకొస్తామని అన్నారు అందుకు తామంతా కృషి చేస్తామని చెప్పారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ కూడా తమ వంతు సహాయ సహకారాలు అందించాలని వారు కోరారు. సమావేశంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన హాకీ అసోసియేషన్ల సభ్యులు పాల్గొన్నారు.

మాసీమ బాబుకు సన్మానం

ప్రజాశక్తి - కడప

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) బోర్డు సభ్యులుగా నియ మితులైన మాసీమ బాబును ఆది వారం మోచం పేటలోని ఆయన నివాసంలో జిల్లా రజక సంఘం అధ్యక్షులు చేలో రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ సి కృష్ణమూర్తి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోవు రోజుల్లో మరిన్ని పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. టిటిడి బోర్డు సభ్యులుగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి, ముఖ్యమంత్రి అంజాద్ బాషకు, వైసీపీ జిల్లా అధ్యక్షులు, నగరం సురేష్ బాబుకు, ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డికి ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు గంగనపల్లి సుబ్బరాయుడు, గంగన్న, ఎరికలయ్య పాల్గొన్నారు.



మాసీమబాబును సన్మానిస్తున్న రవి

పైప్‌లైన్ పగిలి మంచినీరు వృధా

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పార్లపల్లె బ్రహ్మణ్ణ మంచినీటి పథకం నుంచి వస్తున్న పైప్‌లైన్ పగిలిపోవడంతో మంచినీరు వృధాగా పోతోంది. మండలంలోని ప్రజలకు ఫ్లోరైడ్ రహిత మంచినీటిని అందించాలనే లక్ష్యంతో దాదాపు 20ఏళ్ల క్రితం స్కీంను ప్రారంభించారు. అయితే ఇటీవల కాలంలో పైప్‌లైన్ తరచూ మరమ్మతులకు గురవుతూ నీరు లీక్ అవుతోంది. మండలంలోని బిదినంచర్ల సమీపంలో పైప్‌లైన్ లీకేజీ కావడంతో నీరు వృధాగా పోతోంది. ఈ నీరు ప్రవహించడంతో రోడ్డు దెబ్బతింటోందని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి వెంటనే పైప్‌లైన్‌కు మరమ్మత్తు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


వృధాగా పోతున్న మంచినీరు

6, 8న మైదుకూరులో ప్రత్యేక సదరం క్యాంప్

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఈనెల 6, 8 తేదీల్లో ప్రత్యేక సదరం క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రంగస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక సదరం క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన వారు తమ వికలత్వానికి సంబంధించిన సర్టిఫికెట్, ఆధార్, రేషన్ కార్డులతో సిహెచ్‌సిలో సంప్రదించాలని కమిషనర్ సూచించారు. శిబిరంలో వైద్యులు పరిశీలించి అర్హులైన వారికి పింఛన్ వచ్చేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వధూవరులకు టిడిపి నేతల ఆశీర్వాదం

ప్రజాశక్తి - ఖాజీపేట

టిడిపి మండల కన్వీనర్ తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి కుమారుడు పవన్‌కుమార్‌రెడ్డి వివాహ కార్యక్రమానికి ఆదివారం మైదుకూరు టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. స్థానిక ఆంజనేయ కొట్టాలు సమీపంలోని ఇస క్వార్ణా మండపంలో జరిగిన వివాహ కార్యక్రమానికి టిడిపి నాయకులు పుత్తా నరసింహారెడ్డి, సురేష్ నాయుడు హాజరయ్యారు. కడప మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ సందల నాగేశ్వరరెడ్డి, పత్తూరు ఉప సర్పంచ్ ముత్తూరు రమణ, పుల్లయ్య నాయుడు, రామానాయుడు, జెండా మహబూబ్ బాషా పాల్గొన్నారు.


వివాహ వేడుకలో పుట్టా సుధాకర్ యాదవ్

గురుశేఖర్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పట్టణంలోని టికెఆర్ జీవన జ్యోతి హైస్కూల్‌లో గణితం ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న డిసి గురుశేఖర్ యాదవ్‌ను అపుస్మ సంఘం ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసింది. ఆదివారం కడపలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి గురుశేఖర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గురుశేఖర్ ప్రధానోపాధ్యాయుడిగా ఆదర్శమైన వ్యక్తిగా ఉన్నారన్నారు. గురు శేఖర్ యాదవ్ మాట్లాడుతూ ఈ అవార్డుకు ఎంపిక చేసిన జీవనజ్యోతి విద్యాసంస్థల ఫౌండర్ గురుదేవ్ రామిరెడ్డికి, కరస్పాండెంట్ అమర్‌నాథ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మరింత అంకితభావంతో పనిచేసి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అపుస్మ నాయకులు, జీవనజ్యోతి విద్యాసంస్థల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


గురు శేఖర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

నేటి నుంచి మెయిన్ బజార్‌లో పనులు


ప్రజాశక్తి- పులివెందుల రూరల్

పులివెందుల పురపాలక సంఘంలోని మెయిన్ బజార్‌లో సెంట్రల్ బోలె వార్డు పనులు సోమవారం నుంచి పనులు చేయనున్నారు. ఆ మేరకు ట్రాఫిక్‌కు సంబంధించి మున్సిపల్ కమిషనర్ ట్రాఫిక్ ఎస్ఐ హాజీవలితో కలిసి మెయిన్ రోడ్‌ను ఆదివారం పరిశీలించారు. మెయిన్ రోడ్డులో ఇప్పటి వరకు వస్తున్న వాహనాలు సోమవారం నుంచి పడమటి వైపు రోడ్డున వెళ్లేలా చేశారు. అక్కడ వన్ వే చేయనున్నారు.శ్రీరామ హాల్ రోడ్డు వెడల్పు చేయు పనులు జరుగుతున్నందున ఆ రోడ్డున రాకపోకలకు సంబంధించి బస్సులను తాత్కాలికంగా రింగ్ రోడ్డులో వెళ్లేలా చేసేందుకు సంబంధించి కూడా పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ అభినందనీయం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్థానిక జయమ్మ కాలనీ(బాకారాపురం) సమీపంలో ఉన్న షాలోమ్ ప్రార్థన మందిరం నిర్వాహకులు మందిరంలో ఆదివారం చీరల పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వల్లెపు వరప్రసాద్‌చే పంపిణీ చేయించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ఆ కరుణామయుడు చెప్పి నట్లుగా నిన్ను వలె నీ పొరుగు వాని ప్రేమించు అన్నట్లుగా చర్చివారు చీరల పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. పాస్టర్ కృపరాజు ప్రత్యేకంగా చైర్మన్ వరప్రసాద్, కౌన్సిలర్ కిషోర్, రాజశేఖర్ కోసం ప్రార్థన చేశారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆంజనేయులు పాల్గొన్నారు.


చీరలు పంపిణీ చేస్తున్న చైర్మన్ వరప్రసాద్

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - చక్రాయపేట

గండి వీరాంజనేయ స్వామి ఆలయంలో శాశ్వత అన్నదాన పథకానికి కడప నగరం మోడంపల్లె వాస్తవ్యులు దేవగుడి శ్యామ్‌సుందర్‌రెడ్డి, వారి ధర్మపత్ని పద్మజ రూ.1,01,116 విరాళం ఇచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. ఆలయ అర్చకులు కేసరి స్వామి, రాజస్వాములు అంజన్న సన్నిధిలో వారి కుటుంబ సభ్యుల పేరిట పూజలు చేశారు. అనంతరం ఆంజనేయ స్వామి చిత్రపటాన్ని అందజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - పెద్దముడియం

మండల పరిధిలోని పెద్దపసుపుల గ్రామంలో ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో 1993-94 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ వృత్తికి ప్రతిష్టలు తెచ్చిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ సేవలను స్మరించుకుంటూ, వారికి విద్యను నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో బాల్యంలో ని జ్ఞాపకాలను, అనుభవాలను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం చిన్నపిల్లలతో నృత్య కార్యక్రమాలను ఏర్పాటు చేసి, బహుమతులను అందజేశారు.


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

అమలుకు నోచని ఇంటింటికీ రేషన్

ప్రజాశక్తి - చాపాడు

ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ అందించే లక్ష్యంతో రేషన్ బియ్యం పంపిణీ ఆటోలను ఏర్పాటు చేశారు. చాలా గ్రామాల్లో, వార్డుల్లో పూర్తి స్థాయిలో అమలు కావడంలేదు. రేషన్ షాపుల వద్దనే ఆటోలను నిలిపి రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నారనే విమర్శలున్నాయి. చాపాడు మండల పరిధిలోని చాలా గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో వీధుల వెంట బియ్యం పంపిణీ చేపడితే రోజుకు వందలోపు కార్డులకు మాత్రమే బియ్యం పంపిణీ చేయడం కష్టం. రేషన్ షాపుల వద్ద పంపిణీ చేస్తుండడంతో ఒక రోజులో 200 నుంచి 3వందల కార్డుదారులకు బియ్యం పంపిణీ చేపడుతున్నారు. ఎండియు ఆపరేటర్లు ఈ పాస్ మిషన్లలో వేలి ముద్రలు వేసి రేషన్ డీలర్లకు పంపిణీ బాధ్యతలను అప్పగిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో మాదిరిగా పంపిణీ కొనసాగుతుండడంతో ప్రతి ఇంటికి రేషన్ లక్ష్యం నీరుగారుతోందనే విమర్శలున్నాయి. రెవెన్యూ సిబ్బంది రేషన్ పంపిణీని పర్యవేక్షించాలని ఆదేశాలు ఉన్నా వారు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఈ పరిస్థితుల్లో ఎండియు ఆపరేటర్లు, రేషన్ డీలర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు రేషన్ పంపిణీ ప్రక్రియను తరచూ తనిఖీలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

–మైదుకూరు మున్సిపాలిటీ ఇందిరమ్మ కాలనీలో రేషన్ బియ్యం కోసం పడిగాపులు కాస్తూ శనివారం ప్రజలు కనిపించారు. ఇప్పటికైనా అధికారులు ఇంటి వద్దకు రేషన్ అందించేలా చర్యలు తీసుకోవాలని లబ్ధి దారుల డిమాండ్ చేస్తున్నారు. రేషన్ కోసం బారులు తీరిన వ్యవహారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో మైదుకూరు తహశీల్దార్ అనురాధ స్పందించి రేషన్ పంపిణీ వద్దకు సిబ్బందిని పంపారు. సిసి రోడ్లు వేస్తుండడంతో అన్ని వీధులకు ఒకే చోట ఇస్తున్నామని తెలిపారు. మరుసటి నెల నుండి ఇంటి వద్దకు రేషన్ పంపిణీ చేయాలని తహశీల్దార్ ఆదేశించారు. అన్ని గ్రామాల, వార్డులలో ప్రతి ఇంటికి రేషన్ అందేలా చర్యలు తీసు కోవాల్సి ఉంది.


మైదుకూరు ఇందిరమ్మ కాలనీలో శనివారం బియ్యం కోసం బారులు తీరిన ప్రజలు

స్త్రీ నిధి సొమ్ము రికవరీ అయ్యేనా..!

ఉప్పలూరు, యామవరంలో రూ.42 లక్షలు స్వాహా - రికవరీలో అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలోని ఉప్పలూరు, యామరం గ్రామాల్లో డ్వాక్రా సంఘాల మహిళలను మహిళా సమాఖ్య విఓఎలు మోసం చేసి స్వాహా చేసిన వివిధ రుణాలు రూ.42లక్షలు రికవరీ చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఉప్పలూరు గ్రామంలో మహిళా సమాఖ్య విఓఎలు సత్యవతి, గంగిరెడ్డి 2020-21లో స్త్రీ నిధిలో రూ.26 లక్షలు సొమ్ము స్వాహా చేశారు. వారిద్దరూ అనారోగ్యంతో మృతి చెందారు. వీరికి సహకరించిన ఇద్దరు వెలుగు సిసిలను విధుల పట్ల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లేని కారణంగా వెలుగు ఎపిఎంను సస్పెండ్ చేశారు. ఏరియా కో-ఆర్డినేటర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఉన్నతాధికారులు వీరిపై క్రిమినల్ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. రూ.26 లక్షలు స్వాహాకు కారణమైన సిసి, ఎపిఎం, ఎసి నుండి అధికారులు కేవలం రూ.3.50 లక్షలు మాత్రమే రికవరీ చేశారు. సస్పెండ్ అయిన తర్వాత వీరంతా తిరిగి ఉద్యోగాల్లో చేరి వేరే మండలాల్లో విధులు నిర్వహిస్తున్నారు. మిగతా సొమ్ము చనిపోయిన విఓఎలు సత్యవతి, గంగిరెడ్డికి సంబంధించిన ఆస్తులు వేలం వేసి జమ చేయాలని కలెక్టర్ పీడీని ఆదేశించారు. రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద ఆస్తులు వేలం వేసి వచ్చిన డబ్బుతో ఉప్పలూరు గ్రామ సమాఖ్యకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముద్దనూరు రెవెన్యూ అధికారులకు, వెలుగు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు సంబంధించి ముద్దనూరు రెవెన్యూ అధికారులకు కలెక్టర్ ఆరు నెలల క్రితమే నోటీసులు జారీ చేసినా తహశీల్దార్ ఇప్పటికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. యామవరం విఓఎ 2016-17లో డ్వాక్రా మహిళలను మోసం చేసి రూ.16లక్షలు స్వాహా చేశారు. ఉన్నతి ద్వారా వడ్డీ లేని రుణాలు, స్త్రీ నిధి, సామాజిక పెట్టుబడి నిధి, ఇతర సంఘాలకు చెక్కులు రాసి వారి వద్ద నుండి డబ్బులు వసూళ్లు చేశాడు. డ్వాక్రా సంఘాల మహిళలు తీసుకున్న రుణాలను విఓఎకు చెల్లించే వారు. మహిళలు చెల్లించే రుణాలకు కేవలం రసీదులు మాత్రమే ఇచ్చి డబ్బులు విఒ ఖాతాలో జమ చేయకుండా రూ.16లక్షలు స్వాహా చేశా డు. సొమ్ము స్వాహా చేసిన విఓఎపై క్రిమినల్ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఎస్పీ, డిఎస్పీ నుండి ముద్దనూరు పోలీస్‌స్టేషన్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు సిఐ నరేష్ బాబు విఓఎ వీర బ్రహ్మంపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. మండలంలో కేవలం స్త్రీ నిధిలోనే రూ.20 లక్షలు పైబడి గోల్‌మాల్ జరగడంతో మహిళలకు స్త్రీ నిధి నుండి రావాల్సిన రూ.10కోట్లు నిధులు రాకుండా ఉన్నతాధికారులు నిలిపేశారు. నిధులు రాకుండా ఆగిపోడంతో రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించే మహిళల అభివృద్ధికి ఆటంకం ఏర్పడిందని డ్వాక్రా మహిళలు ఆవేదన చెందుతున్నారు.

తగు చర్యలు తీసుకుంటాం

ఆర్ఆర్ యాక్ట్ కింద విఓఎ ఆస్తులు వేలం నిర్వహించి జప్తు చేయమని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అధికారుల సూచనలు మేరకు మహిళా సమాఖ్య అధికారుల నివేదికల ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటాం.

- వెంకటేశ్వర్లు, తహశీల్దార్

నోటీసులు జారీ చేస్తాం

తహశీల్దార్ ఆదేశాల మేరకు ఉప్పులూరు గ్రామంలోని విఓఎల బంధువులకు నోటీసులు జారీ చేసి ప్రజలకు సమాచారం అందించి, తగు చర్యలు తీసుకుంటాం.

- ఇబ్రహీం, ఎపిఎం

ఎడతెరిపిలేని వర్షం.. పొలాలు పదును


పొలాల్లో చేరిన వర్షపు నీరు

ప్రజాశక్తి - చాపాడు

శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు ఎడతెరిపిలేని అధిక వర్షంతో వ్యవసాయ భూములు పూర్తిగా పదునెక్కాయి. పంట పొలాలలో ఎక్కడ చూసినా వర్షపు నీటితో దర్శనమిస్తున్నాయి. మండల పరిధిలోని కేతవరం నుంచి ప్రొద్దుటూరు వైపు గ్రామాలలో మాత్రమే మోస్తారు వర్షం నమోదైంది. రాత్రి తిరిగి మండల వ్యాప్తంగా పూర్తి స్థాయిలో వర్షం నమోదైంది .ఈ ఖరీఫ్ సీజన్‌లో శనివారం రాత్రి కురిసిన వర్షం అధికం అని చర్చించుకుంటున్నారు. మండల వ్యాప్తంగా 92.2మిమి వర్షపాతం నమోదైంది. వారం రోజులుగా ఎండ తీవ్రత అధికమై విద్యుత్ కోతలు మొదలు కావడంతో ప్రజలు నానా అవస్థలు పడేవారు. వరి పంటను సాగు చేసే రైతులు విద్యుత్ సరఫరాలో అంత రాయం కలుగుతుండడం, బోర్లలో నీరు సరిగా రాకపోవడంతో సమస్యలు ఎదుర్కొంటూ రోజూ కొంతమేర మాత్రమే పంట సాగు చేసేవారు. ప్రస్తుతం కురిసిన అధిక వర్షానికి వరి పంట సాగు చేసే రైతులకు ఉపయోగకరంగా మారింది. ఆరుతడి పంటలు సాగు చేసే రైతులకు కూడా భూమి పూర్తి స్థాయిలో పదునైందని భూమి అరగానే దుక్కిలు చేపట్టి విత్తనం వేసే ఏర్పాట్లు చేయొచ్చని రైతులు పేర్కొంటున్నారు. మైదుకూరు మండల వ్యాప్తంగా కూడా శనివారం రాత్రి అధిక వర్షం చోటు చేసుకున్నది. రోడ్ల వెంట ఎక్కడ చూసినా వర్షపు నీరే పోర్లి ప్రవహిస్తూ ఉంది. మైదుకూరు పట్టణంలో ఆదివారం తెల్లవారుజామున రోడ్లు పూర్తిగా నీటితో నిండిపోయాయి. దీనితో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కాలువలు, వంకలలో నీటి ప్రవాహం ప్రారంభమైంది.

భారీ వర్షంతో రైతుల్లో ఆశలు

పులివెందుల టౌన్ : శనివారం రాత్రి కురిసిన భారీ వర్షం ఖరీఫ్ సీజన్ పంటల సాగులో రైతుల్లో ఆశను నింపింది. తీవ్ర వర్షాభావంతో పంటలు ఎండు దశకు చేరుకుంటున్న తరుణంలో ఈ వర్షం ఊరటనిచ్చింది. వేరుశనగ, పత్తి పంటలు సాగులో ఉన్నాయి. విత్తు విత్తినప్పటి నుంచి వర్షాలు లేక పంటలు దెబ్బతింటున్నానే ఆందోళనలో రైతులు కొట్టు మిట్టాడారు. ఈ నేపథ్యంలో భారీ వర్షం పడడం వారిలో ఆనందాన్ని తెచ్చింది.

కరువు గోడు పట్టని సిఎం : టిడిపి

ప్రజాశక్తి - వేంపల్లె

వర్షాల్లేక పంటలు ఎండి అవస్థలుపడుతున్న రైతుల గోడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పట్టడంలేదని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి తెలిపారు. స్థానికంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్ధంతులు, పుట్టిన రోజులకు ముఖ్యమంత్రి జగన్ రెడ్డి రావడం, పోవడం తప్ప జిల్లాలోని రైతుల పరిస్థితిపై అధికారులతో సమీక్షించకపోవడం విచారకరమన్నారు. జగన్ చేపట్టే ఇడుపులపాయ యాత్ర వల్ల ప్రజా ధనం దుర్వినియోగం తప్ప, ప్రజలకు ఒరిగేదేమీలేదన్నారు. వర్షాభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విత్తనాలు వంద శాతం సబ్సిడీతో రైతులకు పంపిణీ చేయాలని కోరారు. 2018లో చంద్రబాబు సిఎంగా ఉన్నప్పుడు ఇలాగే కరువు ఛాయలు నెలకొంటే ప్రివెంట్ ఆఫ్ సోయింగ్ కింద ప్రతి రైతుకు ఎకరాకు రూ.8,500 ఇచ్చారని గుర్తు చేశారు. వర్షాభావంతో 25 శాతం విస్తరణలోనే పంటలు సాగయ్యాయని తెలిపారు. తక్షణమే కడప జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించడంతోపాటు పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో మైనార్టీ నాయకుడు నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, జిల్లా ఉపాధ్యక్షుడు రామగంగిరెడ్డి, ఆర్‌వి రమేష్, తెలంగాణ వలి, మహమ్మద్, గోగుల మల్లికార్జున, వేమిరెడ్డి బాలకృష్ణారెడ్డి, రామకృష్ణారెడ్డి, డక్కా రమేష్, పాములూరు చంటి, డివి సుబ్బారెడ్డి, మల్లంగి పాపిరెడ్డి, పిపి చెంద్రాయుడు, పోతిరెడ్డి శివ, మడకా శ్రీనివాసులు, నామ వేమా కుమార్, గోగుల మారుతి, నందిపల్లి శ్రీరామరెడ్డి, మాబు షరీఫ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రయివేట్ పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయులు వీరే


ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు ప్రయివేట్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ప్రయివేట్ పాఠశాలల యాజమాన్య సంఘం అపుస్మ ఒక్కో పాఠశాల నుంచి ఒక్కరిని ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఆదివారం కడపలో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిచే సన్మానింపబడ్డారు. ఇందులో పద్మావతి హైస్కూల్ నుంచి పల్లా హరిక్రిష్ణ, జాన్స్ హైస్కూల్ నరసింహ మూర్తి, స్లేట్ ప్లే స్కూల్ నుంచి మాఉన్నీషా, రాఘవేంద్ర హైస్కూల్ టి.ప్రభావతి, గీతాంజలి స్కూల్ నుంచి ఎస్.మహబూబ్ బాషా, గౌతమ్ మోడల్ స్కూల్ ఎమ్.సుధాకర్, రేడియన్స్ హైస్కూల్ అర్షద్ జహన్, సరస్వతి హైస్కూల్ నుంచి ముని సుబ్బారెడ్డి, పూజిత హైస్కూల్ సి.హనుమంతు, సాయిబాబా ప్రాథమిక పాఠశాల నుండి రుక్సానా బేగం, సెయింట్ మేరీ స్కూల్ నుంచి రామమోహన్‌రెడ్డి, భారతి విద్యామందిరం నుండి మహాలక్ష్మి ఉన్నారు.

మారుతీనగర్‌లో కలుషిత తాగునీరు

ప్రజాశక్తి - వేంపల్లె

మంచి నీటి కుళాయిల నుంచి కలుషిత నీరు వస్తోంది. ఇడుపులపాయ పంచాయతీలోని మారుతీనగర్ కాలనీ వాసులు ఈ నీటిని చూసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మారుతీనగర్ కాలనీలో దాదాపు 150 కుటుంబాలున్నాయి. వీరికి తాగునీటిని అందించేందుకు సమీపంలో ఉన్న పాపాఘ్ని నదిలో బోరు వేశారు. అయితే శనివారం కాలనీలో ఉన్న మంచి నీటి కొళాయిలన్నింటిలో మురికి నీరు రావడంతో స్థానికులు కంగారు పడుతున్నారు. తాగునీటి కుళాయిల్లో మురికి నీరు రావడంతో తాగడానికి నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి మంచినీటి కుళాయిల్లో డికాషన్‌లా నీరు నల్లగా, మురికిగా ఉన్నట్లు వాపోతున్నారు. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు గాని ఏఒక్కరూ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్యాలు దెబ్బతినే పరిస్థితి నెలకొందని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి తాగునీరు అందించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.


కుళాయిలో నల్లగా వస్తున్న తాగునీరు

క్రీడా నైపుణ్యాన్ని విద్యార్థుల్లో పెంచాలి

జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

క్రీడా నైపుణ్యాన్ని విద్యార్థుల్లో పెంపొందించాలని జడ్‌పి టిసి రవికుమార్‌రెడ్డి కోరారు. స్థానిక తల్లిశెట్టి సుబ్రమణ్యం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆడుదాం ఆంధ్ర అనే టోర్నమెంట్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించేందుకు ముందడుగు వేయాలని సూచించారు. క్రీడల్లో రాణించి మండలానికి మంచి గుర్తింపు తేవాలన్నారు. ఆ మేరకు ఎలాంటి సహాయం కావాలన్నా అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్‌లో ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు పాల్గొనేలా ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో క్రీడల ఇన్‌ఛార్జి రాజశేఖర్, ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర, ఉపాధ్యాయులు రామచంద్రారెడ్డి, చంద్ర మోహన్‌రెడ్డి, పాఠశాల చైర్మన్ గురుప్రసాద్, క్రీడా విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి

ముఖద్వారానికి వెండి వితరణ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల పట్టణంలోని శ్రీ అంకాలమ్మ ఆలయంలో గర్భగుడి ముఖద్వారానికి సంబంధించి వెండి తోరణం ఏర్పాటుకు 1.5 కిలో వెండిని ఆదివారం వితరణ చేశారు. పట్టణానికి చెందిన వెంకట్ నారాయణరెడ్డి, గంగాదేవి దంపతుల కుమారుడు పల్లేటి అశోక్‌కుమార్‌రెడ్డి, ప్రసూన దంపతులు, మనవడు వెంకట అక్షిత్ సాయి రెడ్డి అంకాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, వెండిని ఆలయ చైర్మన్ నాగేంద్రప్రసాద్‌కు అందజేశారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని దాతలు పేర్కొన్నారు. అనంతరం వారిని ఆలయ చైర్మన్ శాలువాతో సత్కరించారు. దాత సోదరుడు అరుణ్‌కుమార్‌రెడ్డి, లావణ్య దంపతులను, చిన్నారులు అహ్నిజ, ఆకాంక్షలను అర్చకులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సురేష్, ఆలయ కమిటీ సభ్యులు నాగభూషణం, రాజు, బాబురెడ్డి, మోహన్, రాముడు, వరలక్ష్మి, సుశీలమ్మ పాల్గొన్నారు.


చైర్మన్‌కు వెండిని అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలో వైసిపి నుంచి టిడిపిలోకి వలస వెళుతున్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని కుప్పం గ్రామం బురుజుపల్లి, కొప్పల వార్లపల్లె గ్రామంలో పలువురు టిడిపిలో చేరారు. టిడిపి మండల కన్వీనర్ తాళ్లపల్లె మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పులివెందుల పార్టీ ఇన్‌ఛార్జి బీటెక్ రవి సమక్షంలో వైసిపి కార్యకర్తలు యోగేశ్వర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, నరసింహులు, కుప్పం సుబ్బారెడ్డి, వల్లెపు సుబ్బయ్య, డీలర్ సుబ్బయ్యతోపాటు 20 కుటుంబ సభ్యులు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో పట్టం అశోక్‌కుమార్, ఎద్దుల చంద్ర, శంకర్‌రెడ్డి, బాలె రామాంజనేయరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, పరమేశ్వర, బిటి పల్లె అమర, ఆంజనేయులు, సుబ్బరామయ్య, శ్రీరామ్‌రెడ్డి, పూర్ణ, మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


టిడిపిలో చేరిన కుప్పం గ్రామవాసులు

దేవాంగపేటలో ప్రవీణ్ పర్యటన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ష్యూరిటీతోనే ఎపి ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆదివారం దేవాంగపేట వీధిలో ఇంటింటికి తిరిగి ప్రజల కష్టాలను తెలుసుకున్నారు. వారి భవిష్యత్తుకు గ్యారెంటీ కలిగించేలా టిడిపి ముందస్తు మానిఫెస్టోను వివరిస్తూ కరపత్రాలు ప్రజలకు అందించారు. కార్య క్రమంలో నాగ సుబ్బ రాయుడు, మధుబాబు, ఎస్వీబీ భాస్కర్‌రెడ్డి, గిద్దలూరు కిషోర్, గిద్దలూరు వీరయ్య, గిద్దలూరు జయరాం, భరత్, గంగాధర్, ఆర్ఎస్ శీను, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, పాల సుబ్బరాయుడు, కె.కృష్ణారెడ్డి, కాటం వీరమోహన్, మచ్చ నాగభూషణం, బి మన్యం, నాగరాజు, నందమూరి అభిమానులు పాల్గొన్నారు.


ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ట్రాఫిక్‌ను పునరుద్ధరించిన పోలీసులు

ప్రజాశక్తి - ముద్దనూరు

కడప - తాడిపత్రి రహదారిలోని ఓబుళాపురం గ్రామం వద్ద రోడ్డు పనులు జరుగుతున్నాయి. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నీరు నిలిచి బురదమయమైంది. ఇరు వైపులా వస్తున్న రెండు లారీలు బురదలో ఇరుక్కు పోయాయి. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడడంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. దీంతో ముద్దనూరు నుండి తాడిపత్రికి రాకపోకలు నిలిచి పోయాయి. రోడ్డు పనులు చేసే కార్మికులు 5 గంటల పాటు శ్రమించి ఇరుక్కున్న లారీలను తొలగించారు. బురదలో ఇతర వాహనాలు ఇరు క్కోకుండా సిఐ నరేష్ బాబు తాత్కాలికంగా రోడ్డును ఏర్పాటు చేయించి, ట్రాఫి క్‌ను క్రమబద్ధీకరించారు. ఎలాంటి ట్రాఫిక్ అసౌకర్యం లేకుండా చేశారు.


ఏర్పాటు చేస్తున్న తాత్కాలిక రోడ్డు

బయపురెడ్డి మృతి టిడిపికి తీరనిలోటు

ఖాజీపేట : మండలంలోని చెముళ్లపల్లెకు చెందిన రెడ్డి చిన్న బయపురెడ్డి (84) మృతి టిడిపికి తీరనిలోటని ఆపార్టీ సీనియర్ నాయకులు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బయపురెడ్డి పార్టీ ఆవిర్భావం 1983 నుంచి జీవితాంతం టిడిపిలోనే కొనసాగారని గుర్తు చేశారు. నీతి, నిజాయితీ, నిబద్ధతతో పనిచేశారని పేర్కొన్నారు. ఆదివారం బయపురెడ్డి మృతదేహం వద్ద రెడ్యం సోదరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

సిమెంట్ దారి లేక.. రాకపోకలు సాగించలేక..!

ఖాజీపేట : అభివృద్ధి కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులను ఖర్చు చేస్తున్నా.. క్షేత్ర స్థాయిలో సత్ఫలి తాన్ని వ్వడంలేదనే విమ ర్శలు న్నాయి. రాకపోకలు సాగించేందుకు సౌకర్యంగా సిమెంట్ రోడ్లు ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానిక మండల కార్యాలయాల సముదాయం ఎదురు వీధి శ్రీనివాస్ నగర్‌కు సిమెంట్ దారి లేకపోవడంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం వస్తే మట్టి రోడ్డు బురదమయంగా తయారవుతోందని, నడవడానికి వీల్లేకుండా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను గతంలో పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా చర్యలు లేవని వాపోతున్నారు. ఏడాదిన్నర కాలంగా సిమెంట్ దారి ఏర్పాటు చేయాలని కోరుతున్నామని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని పేర్కొం టున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు.


అధ్వానంగా ఉన్న శ్రీనివాసనగర్ రోడ్డు